# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 29 జులై , 2026 | పేజీలు :7


## రూ.1.50 లక్షల ఎల్‌ఓసి మంజూరు



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని రేవెల్లి గ్రామానికి చెందిన వంగూరి చిన్న వెంకటయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చులు భరించేందుకు కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు.బాధితుడి వైద్య చికిత్స కోసం ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసి) మంజూరు చేయించారు. మంగళవారం నల్లగొండలోని సిపిఐ కార్యాలయం లో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌డీసీని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ చిన్న వెంకటయ్యకు నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్ర భుత్వం ద్వారా వైద్య సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్సీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ‘సర్’ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సర్ ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) చేస్తున్న పనులను తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్‌డిఓలు, తహసీల్దార్లతో సర్‌పై సమీక్షిస్తూ వీఐపీ ఓటర్లను ప్రత్యేకంగా గుర్తించాలని,ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని,ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిని సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అనంతరం డ్రాఫ్ట్ లిస్టును నియోజకవర్గాల వారీగా రూపొందిస్తామని తెలిపారు.అనంతరం భూముల రీసర్వేపై సమీక్షిస్తూ ప్రభుత్వ భూముల రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. లైసెన్స్ కలిగిన సర్వేయర్లు తహసిల్దార్ ల వద్ద రిపోర్టు చేయాలని ఆదేశించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్,సర్వే ల్యాండ్ రికార్డుల ఏడి దేవరాజ్,ఆర్‌డిఓలు,తహసీల్దాలు హాజరయ్యారు.

**మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి**

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.మంగళవారం ఆయన కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడారు రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులను ఆరుతడి పంటల సాగు వైపు మళ్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు.మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న కందులు, వెజిటబుల్ ఆయిల్ పామ్,సజ్జలు,ఆవాలు,సోంపు తదితర పంటల సాగును ప్రోత్సహించాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి,జిల్లా ఉద్యాన అధికారి టి. శేఖర్, ఏఓ సన్నీ రాజ్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## నిరంతర జలదారి... ఎల్‌నినో ప్రభావానికి ఎడారి..

### ప్రమాదఘంటికలు మోగిస్తున్న ఎల్‌నినో ప్రభావం..
### నీరు లేక రాళ్లు తేలిన హాలియా వాగు...
### సాగుపై తీవ్ర ప్రభావం...

**ప్రజాపక్షం/హాలియా:** నిరంతరం నీటి గలగలలతో... ఉరకలు వేసే హాలియా వాగు ఒక్కసారిగా తడి ఆరి తన గర్భంలో దాచుకున్న రాళ్లు పైకి తేలిన తీరు కలవరానికి గురిచేస్తున్నాయి... నిత్యం నీటితో పరవాళ్ళు తొక్కుతు ఉరకలు వేసే ఈ నిరంతర జలసిరి ఎల్ నినో ప్రతాపానికి కరువు రక్కసి కోరలు చాచి ఉందని చెప్పటానికి ఈ చిత్రమే నిదర్శనం. ఎంతటి ఎండల తీవ్రత ఉన్నా ఎన్నడూ తడి ఆరని ఈ హాలియా వాగు ఎల్ నినో ప్రభావం మూలంగా చుక్క నీరు లేకుండా రాళ్లు తేలిన వైనం రైతుల్ని కలవరానికి గురిచేస్తుంది. కొన్ని వందల ఎకరాలకు ప్రత్యక్షంగాను పరోక్షంగాను సాగునీరుని అందించే ఈ(అహ) హాలియా వాగు నీరు లేక రాళ్లు తేలి వెలవెలబోతుంది. పులిమామిడి నుంచి చివర ఉన్న సూరేపల్లి గ్రామం వరకు వందల ఎకరాలకు సాగు నీరు అందించే ఈ వాగు నీరు లేక అడుగంటిపోయిన తీరు ఎల్ నినో ప్రభావం ఏమేర ఉందో ప్రత్యక్షంగా తెలియజేస్తుంది. గత వారం రోజుల్లోనే వాగులో ఉన్న నీరు రోజింతా ఆవిరిపోతూ వాగులో ఉన్న ఇన్ని రాళ్లు ఉన్నాయా? అని రైతులు ఆశ్చర్యపోయేలా కనిపిస్తున్న ఈ చిత్రాలు కరువును ఆయకట్టులో ఎత్తిచూపుతున్నాయి. ఈ ప్రభావం రైతులపై తీవ్రంగా చూపిస్తుంది. ఒక్క ఖరీఫ్ సాగు లేకపోతే పరిస్థితులు ఎంత తీవ్రంగా ఉంటాయో చెప్పడానికి అద్దంపట్టేలా ఉన్న ఉదాహరణే ఈ వాగు. ఈ ఖరీఫ్ లో ఆయకట్టులో దాదాపు 70 శాతం సాగు తగ్గనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు అంత ఆసక్తి చూపక పోవడంతో ఆహార ధాన్యాల కొరత మరింత తీవ్రం కానుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆరుతడి పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని వ్యవసాయ శాఖ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదు. ఆయకట్టులు కేవలం వరిపైనే ఆధారపడిన రైతులు దాని స్థానంలో ఇతర పంటల సాగుకు ఆసక్తి చూపించకపోవడం గమనార్హం. ఏదేమైనా ఎల్ నినో ప్రభావం మునుముందు మరింత తీవ్రతరం అయితే దానిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయాల వైపు రైతులు మొగ్గు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## మహిళా వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** సమాజంలో రోజు రోజుకీ మహిళలపై పెరుగుతున్న వివక్షతను అరికట్టేందుకు మహిళలంతా సంఘటితంగా ఉద్యమించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ అన్నారు. చౌటుప్పల్ ఎన్‌ఎఫ్ ఐడబ్ల్యు మొదటి మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణ, సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం మహిళా సమైక్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా బద్దులకలమ్మ, ఉపాధ్యక్షురాలిగా బెదరకోట శివరాణి, కార్యదర్శిగా కడవేరి కౌసల్య, సహాయ కార్యదర్శిగా ఎడెల్లి శశికళ, కోశాధికారిగా ఉడత పార్వతమ్మ, కార్యవర్గ సభ్యులు గంగనబోయినలక్ష్మి , కుంటిధనమ్మ, భాగ్యమ్మ, అనూషను ఎన్నుకున్నారు.



# లాటరీ పేరుతో మోసం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని వల్లాపురం గ్రామంలో అమాయకులను లాటరి పేరుతో మోసం చేసిన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంగా చిరునామ గల ఆది గంగ పేరు మీద కంపెనీ ప్రచారం అని ఇద్దరు వ్యక్తులు బైకులపై వచ్చి అమాయకులను మోసం చేశారు. ఆది గంగా కంపెనీ నుండి ప్రచారం కోసం వచ్చామని తెలిపి మూడు సబ్బులు చూపించి ఏ చిట్టి వస్తే ఆ వస్తువు మీకు వస్తుందని మాయమాటలు చెప్పి సబ్బులు ఇచ్చి వాటిని ఓపెన్ చేస్తే చిట్టిలు వచ్చిన వారికి 7వేల రూపాయల విలువ చేసే వస్తువులు వచ్చాయని బయట మార్కెట్‌లో 15వేలు విలువ చేస్తాయని వారికి అంటగట్టారు. వాటి మీద మళ్లీ ఆఫర్లు ఉన్నాయని నమ్మ బలికించి ఆఫర్ వస్తువులు ఉన్నాయని వాటికి ఆదనంగా ఐదువేలు రూపాయలు విలువ చేసే వస్తువులను రెండువేల రూపాయలకే వస్తున్నాయని తెలిపి వారి నుండి అదనంగా రెండువేల రూపాయలు బాధితుల నుండి కట్టించుకుని నాసిరకం వస్తువులు ఇచ్చారు. ఇంకొక మంచి ఆఫర్ ఉందని నాలుగువేలు చెల్లిస్తే 20వేల రూపాయల రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వస్తువుల ఫోటో చూపెట్టి నమ్మించి జూలై 25వ తేదీన లాటరి డ్రా తీస్తామని మీకు చిట్టి కలిస్తే ఆ రోజే మీకు వస్తువులను అందజేస్తామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మి ఈనెల 19వ తేదీన బాధితులు ఒక్కొక్కరు నాలుగువేలు, కొంతమంది 8వేలు వారి నుండి డబ్బులు కట్టించుకున్నారని తెలిపారు. తీరా గడువుతేదీ 25న వారు ఇచ్చిన




ఫోన్ నెంబర్లు 97034 00678, 88852 29759 కాల్ చేస్తే లిఫ్ట్ చేయడంలేదని, దీంతో మేము మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. గ్రామాల్లో ఇంటి వద్ద ఉండే మహిళలను ఆసరగా చేసుకుని వారి దగ్గరకు వెళ్లి లాటరీ పేరుతో మోసాలు చేయడం ఈ మధ్య కాలంలో పలుచోట్ల వెలుగులోకి వచ్చాయి. పోలీసు వారు ఎన్ని హెచ్చరికలు చేసిన పత్రికలలో ఎన్ని కథనాలు వచ్చిన ప్రజలు తీరు మారడంలేదు. అమాయకులైన ప్రజలు ఆశకు పోయి ఏదో ఒక చోట ఇటువంటి లాటరీల పేరుతో మోసగాళ్ల చేతుల్లో చిక్కి మోసపోతూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ఇటువంటి మోసగాళ్ల నుండి అమాయకులైన ప్రజలను రక్షించాలని బాధితులు కోరుతున్నారు.

## అభ్యర్థులు ధృవపత్రాల పరిశీలనకు హాజరుకావాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలోని 67 అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 29 నుండి 3 ఆగష్టు లోగా ధృవపత్రాల పరిశీలనకు హాజరు కావాలని జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహా రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అంగన్‌వాడీ పోస్టులకు సంబంధించి ఈనెల 13 నుండి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. అట్టి దరఖాస్తుదారులు తమ ఒరిజనల్ ధృవపత్రాలు, రెండు సెట్ల జిరాక్స్‌లతో సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో 3 ఆగష్టు 2026, సాయంత్రం 5 గంటల లోగా హాజరు కావాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణ బాధ్యత



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటిలోని 7, 8 వార్డులలో మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, హరితహారం లక్ష్యాల సాధనలో భాగంగా వివిద రకాల మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్, మున్సిపల్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## ఆరు తడి పంటలను సాగు

**ప్రజాపక్షం/చివ్వెంల :** ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తగినంత లేనందున రైతులు తక్కువ నీటితో ఎక్కువ లాభం అందించే ఆరు తడి పంటలను సాగు చేయాలని మండల ప్రత్యేకాధికారిణి సులోచన రాణి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ చక్రాల సంతోష్ కుమార్, వివిధ మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అవగాహన కల్పించాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఎల్‌నినో ప్రభావంపై వ్యవసాయ రంగంలో రైతులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి వి.మోహన్‌బాబు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జలసిరి పనులపై పలు శాఖల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులతో అవగాహన సమీక్ష నిర్వహింంచారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో సోమసుందర్‌రెడ్డి, తహసిల్దార్ సైదులు, ఎవో జావెద్, వైద్యాధికారిణి డాక్టర్ నాగిని, ఎంపివో నాగరాజు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.




## భూగర్భ జలాల పెంపునకు జలసిరి పనులు ఎంతో కీలకం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** భూగర్భ జలాల పెంపునకు జలసిరి పనులు ఎంతో కీలకమని అడిషనల్ కలెక్టర్ బి. హరిసింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎల్‌నినో ప్రభావం, విబిజిరామ్‌జి, జలసిరి పనులపై గ్రామ సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, విఓఏలకు ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి చేనుకు పంట కుంట, ప్రతి ఊరుకు ఊటకుంట అనే నినాదంతో మండలంలో పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని పిలుపునిచ్చారు. అధికారులు, క్షేత్ర సహాయకులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి సంరక్షణపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల



న్నారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ విభాగాలకు సంబంధించిన రికార్డులను, భూమి దస్త్రాలను నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఓ ఏ. జానయ్య, తహశీల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి, మండల పంచాయితీ అధికారి బిస్. రాజేశ్వర్, ఏపిఓ రవి, మండల వైద్యాధికారులు రాజేష్, వెంకన్న, వ్యవసాయ అధికారి అనిల్, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ముకుందాపురం దళితవాడలో వ్యవసాయ కార్మికుల సర్వే



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు మంగళవారం మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలోని దళితవాడలో వ్యవసాయ కార్మికులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు పోసనబోయిన హుస్సేన్, జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ శ్రీను లు మాట్లాడుతూ వ్యవసాయ కూలి కుటుంబాలను కలిసి వారి జీవన పరిస్థితులు, కూలిరేట్లు, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లులేని కూలీలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వితంతువులకు, వృద్ధులకు సకాలంలో ఫించన్లు అందడంలేదని అన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు, రేషన్‌కార్డుల్లో పేర్లు తొలగించడం సరికాదన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ కార్మికులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు కేంద్ర ప్రభుత్వ హత్యలే



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు కేంద్ర ప్రభుత్వ హత్యలేనని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు విమర్శించారు. మంగళవారం పట్టణ సిపిఐ కమిటి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు నీట్ పేపర్ లీక్ రద్దు వల్ల కలత చెంది ఆత్మహత్య చేసుకుని అమరులైన 23 మంది విద్యార్థులకు కోవ్వోత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ మరో విద్యార్థిని కూడా ఆత్మహత్య చేసుకుందని, కేంద్ర పాపం ఎందరిని బలి తీసుకుంటుందో తెలియదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం మృతి చెందిన విద్యార్థులకు కోటి నష్ట పరిహారం ఇవ్వాలని, దేశ వ్యాప్తంగా ఉద్యమంలో పాల్గొన్న యువకులు, విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్లకు అంగీకరించిన కేంద్రం బీహార్, బెంగాల్, అస్సాం తదితర రాష్ట్రాల్లో విద్యార్థులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. హామీలను అమలు చేయకుంటే మళ్లి ఉద్యమం తప్పదని పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చి పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కత్తి శ్రీనివాసరెడ్డి, చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్, పరికె భరత్ పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని సామాజికవేత్త, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా. చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 1000 మంది విద్యార్థులతో మీనాక్షి సెంటర్ నుండి కోర్టు మీదుగా బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు భారీ ర్యాలీగా నినాదాలతో చేరుకొని మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల పట్ల కక్షపూరితమైన ఆలోచన లేకుండా మొండి వైఖరిని వీడి పెండింగ్లో ఉన్న 10,500కోట్ల స్కాలర్ షిప్‌లను రియంబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని, చదువు పూర్తయినప్పటికి ఇంజనీరింగ్, వివిధ కళాశాలల యజమాన్యాలు విద్యార్థులు ప్రభుత్వం ద్వారా వచ్చేటటువంటి పెండింగ్ బకాయిలు విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల సర్టిఫికేట్లు కూడా తీసుకోకుండా పై చదువులకు వెళ్ళకుండా




ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం దశలవారిగా ఎత్తివేసి విద్యార్థుల భవిష్యత్తును అణిచివేసే కుట్ర చేస్తుందని అన్నారు. విద్యార్థుల పట్ల ఇలాగే కక్ష సాధింపు ధోరణి కొనసాగితే ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కోటేశ్వర్ రావు, వెంకటేష్, డా. భాస్కరాచారి, బిక్షమయ్య, బాలచందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, గణేష్, గౌతం, లావణ్య, రమేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 31న జాబ్‌మేళా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 31న జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర డిగ్రి కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మహమ్మద్ జానిపాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట సమీపంలోని అపోలో ఫార్మసి, కియా మోటార్స్ (బెంగళూరు/అనంతపురం), టివిఎస్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలలో 400 ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కంపెనీలలో ఫార్మసిస్ట్, ఆపరేటర్ ఎలక్ట్రానిక్, ఐ ఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్‌లలో భర్తీకై ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమా, ఫార్మసి (బిడిఎం), ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉన్న అర్హత ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బయోడేటా ఫారమ్‌తో హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జీతం రూ.12వేల నుండి వివిధ పోస్టులకు నెలకు రూ.25వేల వరకు వేతనం ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9989655489ను సంప్రదించాలని కోరారు.

## బివోసి కార్డును రెన్యూవల్ చేసుకోవాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కార్మికులకు అండగా ఐఎన్‌టియుసి ఏళ్లవేళలా అండగా నిలుస్తుందని, బివోసి కార్డును రెన్యూవల్ చేసుకోవాలని హుజూర్‌నగర్ నియోజకవర్గ ఐఎన్‌టియుసి అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్యగౌడ్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఐఎన్‌టియుసి అనుబంధ సంఘమైన వర్కర్స్ యూనియన్ నాయకుడు రాచకొండ రవి ఇటీవల బైక్ ప్రమాదానికి గురై తీవ్రగాయాలు కాగా ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఐఎన్‌టియుసి నాయకులు ఆయనను పరమార్శించి మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు బిల్డింగ్ బివోసి కార్డు కలిగిన కార్మికులు సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేళ్లచెరువు ముక్కంటి, చింతకాయల రాము, సరస్వతి పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని బిసి జెఏసి జిల్లా కన్వీనర్ బద్రబోయిన సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బిసి జెఏసి జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి పదవి ఖాళీగా ఉండటం వల్ల విద్యారంగం మొత్తం అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి లేకపోవడంతో ఫీజురియంబర్స్‌మెంట్, గురుకులాల సమస్యలు, ఉపాధ్యాయ నియామకాలు అన్ని నిలిచిపోయాయన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిపులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా బిసి జెఏసి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజి జెఏసి జిల్లా ఉపాధ్యక్షులు బైరోజు మదనాచారి, నాయకులు ముత్యం నాగేంద్రబాబు, కృష్ణ, కూరాకుల శ్యామ్ పాల్గొన్నారు.





## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దేవరకొండ ఆర్డీవో పరిటాల పద్మప్రియ కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. నాగేశ్వరరావుకు సూచించారు. మంగళవారం ఆర్డీవో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజేందర్‌రెడ్డి, తహశీల్దార్ నరేందర్, ఎంపిడివో స్వర్ణలత, ఆర్ఐ శ్రీనివాస్, ఎంఎస్‌వో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ తదితరులు పాల్గొన్నారు.

## జలసిరిపై అవగాహన

ప్రజాపక్షం/నాంపల్లి : ఎల్ నినో ప్రభావం వల్ల కరువు నివారణే ధ్యేయంగా ముందస్తు చర్యలు చేపట్టాలని నల్లగొండ అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి హరీశ్ కుమార్ పిలుపునిచ్చారు. వీబీజీ రాంజీ పథకం ద్వారా జల సంరక్షణ పనులు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు.మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ జలసిరి పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు.మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు , పంచాయతీ సిబ్బందికి జలసిరి పథకంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి హాజరైన హరీశ్ కుమార్ అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి తెలంగాణ జలసిరి ప్రత్యేక పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ అవగాహన సదస్సులో ఎంపీఓ మధు, ఏపీఓ గుంటక వెంకటేశం, ఏఈపీఆర్ జీవన్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరులు,ఏపీఎం శోభారాణి పాల్గొన్నారు.

## వైవిధ్యీకరణ ద్వారా నష్టాలను తగ్గించుకోవాలి

ప్రజాపక్షం/చింతలపాలెం : వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంభించి పంటల వైవిధ్యీకరణ ద్వారా నష్టాలను తగ్గించుకోవాలని తహశీల్దార్ రామకృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి శశాంక్ కోరారు. మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం ఉన్నందున వరికి బదులుగా కంది, మొక్కజొన్న, ఆయిల్‌ఫామ్ వంటి పంటలను సాగు చేయాలన్నారు. కంది, మిరప, కూరగాయల పంటల విత్తనాల ప్రదర్శన, నానో యూరియా, నానో డీఏపి స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు వాటి విశేషాలు, సాగు పద్ధతులపై వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు భవన్, దుర్గ భవాని, వివిధ గ్రామాల రైతులు, వ్యవసాయ ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.




## రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

ప్రజాపక్షం/నడిగూడెం: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ రైతులకు సూచించారు. మంగళవారం రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో రైతు వేదికలో జరుగుతున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ సంబంధ అనేక అంశాలపై విస్తృత అవగాహన కలుగుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని అన్నారు. ఉద్యానవన పంటలవైపు రైతులు మొగ్గు చూపాలని అన్నారు. ఆయిల్‌ఫామ్ పంటల సాగు వల్ల మంచి లాభాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఉత్తమ రైతులను, వ్యవసాయ అధికారులను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. రైతులకు విత్తన ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరపతమ్మ సుధీర్, మండల ప్రత్యేక అధికారి దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్ మంగా, ఎంపిడివో మల్సూర్‌నాయక్, ఎడిఎ జ్ఞానేశ్వరి, ప్రశాంతి, ఎంఎవో మల్సూర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## 46 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలంలోని 46 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 29న గ్రామసభలు నిర్వహించి సమగ్ర గ్రామాభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని మిర్యాలగూడ ఎంపీడీవో ఎం.శేషగిరిశర్మ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ మిర్యాలగూడ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జూలకంటి వెంకటరెడ్డి అధ్యక్షతన తెలంగాణ జలసిరి పథకం నీటి సంరక్షణ పనులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట అనే నినాదంతో నీటి సంరక్షణ కార్యక్రమాలు ప్రతి గ్రామంలో జలసిరి, వివిజిరాంజి పథకం ద్వారా చేపట్టాలని అన్నారు. ప్రతి గ్రామానికి 200 మ్యాజిక్ సోక్ పిట్ లు, 5 చొప్పున కమ్యూనిటీ సోక్ పిట్ లు, 5 చొప్పున బోర్ వెల్ రీఛార్జ్ కట్టడాలు, 5 చొప్పున రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ కట్టడాలు, 5 చొప్పున పంట కుంటలు, ఫామ్ పాండ్ లు, 5 చొప్పున వ్యవసాయ దిగుడు బావులు వివిజిరాంజి పథకం నుంచి 15 ఆగస్టు 2026 వరకు నిర్మించాలని తెలియజేశారు. ఎం. బుష్యేంద్రమణి, ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ మణిదీప్, వైద్యాధికారి డాక్టర్ షేక్ మొయిద్, వివిజిరాంజి సిబ్బంది ఈసి కళావతి, రేణుక, టిఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, సెర్ప్ ఏపిఎం దిలీప్, నిజాముద్దీన్, మహిళా సమాఖ్య మండల మహిళా అధ్యక్షులు, కార్యదర్శి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉర్దూ అకాడమీ భూమి లీజు ఉత్తర్వును రద్దు చేయాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో తెలంగాణ ఉర్దూ అకాడమీకి చెందిన 5220 చదరపు గజాల భూమిని ఒక ప్రైవేటు కంపెనీకి ముప్పై సంవత్సరాల లీజుకు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని బీఆర్ఎస్ మైనారిటీ రాష్ట్ర నాయకులు ఫహీమొద్దీన్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ ఉర్దూ అకాడమీకి చెందిన ఒక ఎకరం నాలుగు గుంటలు అంటే 5220 చదరపు గజాల భూమిని హైదరాబాద్ కు చెందిన ఎన్ ఎస్ ఇన్ ఫ్రా అండ్ కన్ స్ట్రక్షన్స్ సంస్థకు ముప్పై సంవత్సరాల లీజుపై ఇచ్చేందుకు అనుమతించారని ఈ ఉత్తర్వులను మైనారిటీ వ్యవహారాల శాఖ కార్యదర్శి జారీ చేశారన్నారన్నారు. ఇలాంటి నిర్ణయం తీసుకునే అధికారం కార్యదర్శికి లేదని అన్నారు. ఇలాంటి కీలక నిర్ణయానికి ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆమోదం తప్పనిసరని, ప్రజా నోటీసు ఇచ్చి, అభ్యంతరాలు, సూచనలు స్వీకరించే ప్రక్రియ పాటించాలని చెప్పారు. ఆ ప్రక్రియను పాటించకుండా ఉత్తర్వులు జారీ చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు.ఆ ఉత్తర్వును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి, ప్రభుత్వ సలహాదారుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్, ఇతర కార్పొరేషన్ల మైనారిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు మైనారిటీ ప్రజలకు క్షమాపణలు చెప్పి ఇలాంటి తప్పుడు నిర్ణయాలను విరమించుకోవాలని ఫహీమొద్దీన్ డిమాండ్ చేశారు.

## రైతులు వరి పంట సాగు తగ్గించాలి



ప్రజాపక్షం/చింతలపాలెం : రైతులు వరి పంట సాగు తగ్గించాలని తహశీల్దార్ బి. రామకృష్ణారెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ. ఆండాలు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ జలసిరి, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మండల స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తగినంత కురిసే అవకాశం లేదన్నారు. దీని వల్ల భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి భూపాల్ రెడ్డి, విద్యుత్ ఏఈ సైదయ్య, మండల వ్యవసాయ అధికారి శశాంక్, గ్రామ సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## వేముల వీరేశంకు ఘన సన్మానం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: నకిరేకల్ శాసనసభ్యులు, తెలంగాణ ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు రాష్ట్ర మంత్రి హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా ఆయనను పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు కలిసి సన్మానించారు. మేడి పాపన్న మాదిగ సారథ్యంలోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామంజి సైదులు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూక పంగు కాశయ్య మాదిగ ఆధ్వర్యంలో నాయకులు నకిరేకల్‌లోని వేముల వీరేశం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజమూరి కరుణాకర్, బొల్లంపల్లి సైదులు, ఏర్పుల వెంకన్న, ఒగ్గు రవీందర్, కందికంటి ప్రేమ్ కుమార్, రావులపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమం చేపట్టాలి




ప్రజాపక్షం/నూతనకల్ : ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన ఎల్‌నినో, జలసిరి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య మాట్లాడుతూ ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో వివిజి రామ్‌జి పథకం కింద గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ప్రతి చేనుకు పంట కుంట, ప్రతి ఊరుకు ఊటకుంట, బోరుబావుల రీచార్జి నిర్మాణాలు విడివిడిగా చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్‌పర్సన్ నాగం జయసుధ, మండల ప్రత్యేక అధికారిని భారతి, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సునీత, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అత్యవసర ప్రణాళిక రూపొందించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : రాష్ట్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం ఎదుర్కోవడానికి అత్యవసర ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజక వర్గ ఇంచార్జి ధర్మార్జున్ ప్రభుత్వాన్ని కోరారు. ఎల్‌నినో ప్రభావంపై సూర్యాపేట నియోజక వర్గ తెలంగాణ జనసమితి నాయకులు జరిపిన అధ్యయనంపై మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చర్చించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వానకాల వ్యవసాయం వెనుకబడి పోయిందన్నారు. రైతులు కరువు భయంతో గ్రామాలలో పంటలు ఏమి వేయలేకపోయారని, వరి పంట కూడా పూర్తిగా నాటు వేయలేకపోతున్నారని తమ అధ్యయనంలో తేలిందన్నారు. ముందస్తుగా వేసిన పత్తి మొలకవపోవడం మొలకెత్తినా బలహీనంగా ఉండడంతో అదనపు పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని దీంతో రైతులపై అదనపు భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేటకు బుల్లెట్ రైల్వే సాధన పోరాటంలో తమ పార్టీ ఆధ్వర్యంలో క్రియాశీలకంగా పాల్గొంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నారబోయిన కిరణ్ కుమార్, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు బచ్చలకూరి గోపి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు కుంచం చంద్రకాంత్, నాగు నాయక్, బొమ్మగాని వినయ్ గౌడ్, ఈశ్వర్ సింగ్ పాల్గొన్నారు.



## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

**ప్రజాపక్షం/మునగాల:** వ్యవసాయ రంగాన్ని మరింత సులభతరం చేసి, రైతులకు లాభదాయకంగా తీర్చిదిద్దడమే రైతు నేస్తం అని మండల ప్రత్యేక అధికారి జడ్పి డిప్యూటి సిఈవో మహాలక్ష్మి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం 100వ ఎపిసోడ్‌లో ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సరిత, ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్, వ్యవసాయ అధికారి బి.రాజు, సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్, ఎఈవో సునిత, ఎంపివో నరేష్, ఎపివో శైలజ, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ వర్తక మెన్స్ వేర్ సంఘం అధ్యక్షుడిగా బాలరాజు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పురపాలక కేంద్రంలోనీ టై అండ్ డై ఫంక్షన్ హాల్‌లో మంగళవారం శ్రీ లక్ష్మి నరసింహ బట్టల వర్తక, మెన్స్ వేర్ సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మక్తల కృష్ణ అధ్యక్షులుగా దోర్నాల బాలరాజు, ఉపాధ్యక్షులుగా పి.ప్రవీణ్, రావుల సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎస్ శేఖర్ కోశాధికారి కందగట్ల ధనంజయ, కార్యవర్గ సభ్యులుగా దోర్నాల సంతోష్, భువనగిరి సాగర్, వంగూరి విజయ, జిట్టల భాను, రుద్ర బాలసుబ్రమణ్యం, గర్దాసు ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, గంజి గోపాల్, విద్యాసాగర్, కే.సునితను ఎన్నుకున్నారు.

## పలువురు కుటుంబాలకు బీర్ల పరామర్శ

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పలువురు కుటుంబాలను పరామర్శించారు. మండల కేంద్రంలో ములుగు సరోజన మృతి చెందడంతో సరోజన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామానికి చెందిన కొండపల్లి సాంబ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను పరామర్శించారు. సాంబ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మోదుగుంట గ్రామ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ సుదగాని కుమార్ సతీమణి మహేశ్వరి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహేశ్వరి చిత్రపటానికి నివాళులర్పించారు.



## రైతుల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం



**ప్రజాపక్షం/అనంతగిరి:** రాష్ట్రంలో రైతు కన్నీరు పెడుతుంటే మనసు గోస పడుతుందని, రైతు పక్షాన పోరాడేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తానని రైతు సమస్యల పరిష్కారానికి ప్రాణత్యాగానికైనా సిద్ధమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. నాణ్యమైన విద్యుత్ రైతులకు అందించాలని డిమాండ్‌తో మంగళవారం అనంతగిరి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యుత్ ఎఈతో ఫోన్‌లో మాట్లాడి లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల కష్టాలు మళ్లి మొదటికి వచ్చాయని అన్నారు. బోనస్, బోగస్ అని రుణమాఫి మాయమైపోయిందని, రైతు భరోసా నిధులు ఎప్పుడో స్తాయో తెలియదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నల్ల భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుగులోతు శ్రీనివాస్‌నాయక్, అఫ్జల్, పందిరి వీరయ్య, మట్టపల్లి సైదులు, పుల్లయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, లచ్చయ్య, కృష్ణ, శీలం సత్యనారాయణ పాల్గొన్నారు.

## పశుపోషణపై ఎల్‌నినో ప్రభావం నివారణకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/కోదాడ:** పశుపోషణపై ఎల్‌నినో ప్రభావం నివారణకు కృషి చేయాలని, ఎకరం పశుగ్రాస పెంపకంతో సంవత్సరానికి రెండు లక్షల ఆదాయం వస్తుందని జిల్లా పశుసంవర్ధక అధికారి బేదేపూడి శ్రీనివాస రావు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణ ప్రాంతీయ పశువైద్యశాలలో కోదాడ నియోజకవర్గ పశువైద్యులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పశుపోషకులు పశుగ్రాసం కొరత ఎదుర్కోవడానికి ప్రత్యామ్నయ పశుగ్రాస ఏర్పాటుకి గ్రామాల వారిగా అందుబాటులో ఉన్న పశువుల సంఖ్య వాటికి మరో ఆరు మాసాల వరకు కావాల్సిన పశుగ్రాసం ప్రస్తుతం రైతుల వద్ద అందుబాటులో ఉన్న పశుగ్రాసం లెక్కలతో వేసిన పంటల ద్వారా ఖాళీ భూముల ద్వారా అందే పశుగ్రాసం మొత్తం లెక్కించి అవసరం ఉన్న వారికి రైతులకు సబ్సీడీలో పశుగ్రాస విత్తనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య, వివిధ మండలాల పశువైద్య సహయ శాస్త్ర చికిత్సలు కె.ఉషారాణి, వీరారెడ్డి, రవికుమార్, అఖిల, మధు, హరిత, సురేష్, సిరిపురపు సురేంద్ర పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల ఐక్యతతోనే మతోన్మాద శక్తులకు ముకుతాడు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కమ్యూనిస్టుల చీలిక వల్లే దేశంలో మనువాద, మతోన్మాద శక్తులు పెట్రేగిపోతున్నాయని, వామపక్ష ఐక్యత కోసం ఎంసీపీఐయూ ప్రయత్నాలు ముమ్మరం చేసిందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ తెలిపారు. మంగళవారం స్థానిక స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీల ఏకీకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో సత్ఫలితాలు ఇస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. నిరుద్యోగ ఉద్యమాలను పక్కదారి పట్టించేందుకు కేంద్రం, మీడియా కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో విద్యార్థులు ముందుండటం అభినందనీయమన్నారు.అనంతరం ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన శక్తికి మించి వాగ్దానాలు చేసి, నేడు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు వల్లేపు ఉపేందర్‌రెడ్డి, మోర్తాల చందర్‌రావు, చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షురాలు వస్కుల సైదమ్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, అరుణ్ కుమార్, ఎన్.రెడ్డి, హంసారెడ్డి, మాదం తిరుపతి, గోనె కుమారస్వామి, తాటికొండ రవి, వనం సుధాకర్, సంగతి సాంబయ్య, పెద్దారపు రమేష్, భాషిపాక బాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులకు ప్రశంసలు

### హైరిస్క్ గర్భిణికి విజయవంతమైన అత్యవసర శస్త్రచికిత్స

### తల్లి-బిడ్డ క్షేమం..




**ప్రజాపక్షం/నకిరేకల్** : క్లిష్ట పరిస్థితుల్లో ఆసుపత్రికి చేరిన ఓ హైరిస్క్ గర్భిణికి నకిరేకల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి తల్లి, శిశువు ప్రాణాలను కాపాడారు. ఆరు రోజులపాటు ప్రత్యేక వైద్యం అందించిన అనంతరం ఇద్దరినీ సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి చేశారు.నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డకు చెందిన ఓ మహిళ (36 వారాల గర్భిణి) తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఏరియా ఆసుపత్రిలో చేరారు. గర్భాశయంలో నీటి పరిమాణం అత్యల్పంగా ఉండడం (ఒలిగోహైడ్రామ్నియోస్),గర్భంలోని శిశువు ఎదుగుదల లోపించడం (ఐయూజీఆర్),శ్వాసకోశ ఇన్ఫెక్షన్ వంటి సమస్యలతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది.కేసు తీవ్రతను గుర్తించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి పర్యవేక్షణలో గైనకాలజిస్టులు డాక్టర్ ఇందిర, డాక్టర్ స్వాతి, శిశువైద్య నిపుణురాలు డాక్టర్ అరుణ, అనస్థీషియా వైద్యులు, నర్సింగ్ బృందం సమన్వయంతో తక్షణమే అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించారు.ఈశస్త్రచికిత్సలో 1.8 కిలోల బరువుతో శిశువు జన్మించింది.అనంతరం నర్సింగ్ సూపరింటెండెంట్ ఉమా ఆధ్వర్యంలోని సిబ్బంది తల్లి,శిశువుకు నిరంతర పర్యవేక్షణతో ప్రత్యేక వైద్యం అందించారు. ఆరు రోజుల చికిత్స అనంతరం ఇద్దరూ పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు.



## ఉత్తుత్తి ఆరోపణలు

**సామాజిక తనిఖీలో బయటపడిన వాస్తవాలు**

**సాంకేతిక లోపాలే తప్ప నిధుల దుర్వినియోగం లేదని స్పష్టం**

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలు జరిగాయంటూ ఇటీవల చేసిన అరోపణలు ఆధారరహితంగా తేలాయి. మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) లో గ్రామంలో ఉపాధి హామీ పనులపై సమగ్రంగా పరిశీలించిన అధికారులు ఎలాంటి ఆర్థిక అక్రమాలు లేదా నిధుల దుర్వినియోగం జరగలేదని వెల్లడించారు. తనిఖీల సందర్భంగా సాధారణంగా కనిపించే సాంకేతిక అంశాలు మస్టర్ రోల్స్ నిర్వహణలో ఉన్న స్వల్ప లోపాలను మాత్రమే అధికారులు గుర్తించి వాటిని సరిదిద్దాలని సూచించారు. అయితే అక్రమాలు జరిగాయనే ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేశారు. దీంతో కొందరు వ్యక్తులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా అనవసర ప్రచారం కల్పించేందుకు నిరాధర అరోపణలు చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతుందని గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి చర్యలను ప్రజలు నమ్మొద్దన్నారు.

## యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం




**ప్రజాపక్షం/డిండి;** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టేందుకు యువత ఉద్యమించాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల నవీన్ అన్నారు. సోమవారం రాత్రి తవక్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఏఐవైఎఫ్ గ్రామ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికల సమయంలో యువతకు ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని హామీలు ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికి నోటిఫికేషన్లు ఇవ్వకుండా, జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా జాప్యం వహిస్తున్నాయని అన్నారు. తక్షణమే నోటిఫికేషన్లు ఇవ్వాలని లేని పక్షంలో యువతను చైతన్యం చేసి ఉద్యమాలకు సిద్ధం చేస్తామని అన్నారు. అనంతరం నూతన గ్రామశాఖ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎండి. బాబర్, ప్రధానకార్యదర్శిగా ఆదిల్, ఉపాధ్యక్షులుగా రమేష్, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా నవీన్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్షులు నరేష్, సిపిఐ తవక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి చక్రి, సైదులు, మహేష్, శ్రీను, మల్లేష్, నాగరాజు, జంగయ్య, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పంటలపై మొగ్గుచూపాలి

**ప్రజాపక్షం/పాలకవీడు:** రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని మండల ప్రత్యేక అధికారి కె.ప్రార్థసారధి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుడుగుండ్ల పాలెం రైతువేదికలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో వరి పంటలు సాగు చేయాలంటే సరిపడా నీరు ఉండాలని, తక్కువ నీటితో ఆరుతడి పంటలైన కందులు, మినుములు, పెసర, జొన్నలు, కొర్రలు, రాగులు, నువ్వులు, ఉలవల, ఉద్యాన వన పంటలు, కూరగాయలు, పండ్లు, పూలు, మునగ పంటలను సాగు చేసుకోవాలన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి, అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.






## శ్రీశైలం కళావేదికపై నకిరేకల్ నాట్య నైపుణ్యం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలోని ధర్మపథం కళావేదికపై నకిరేకల్ నాట్య మండలి చిన్నారులు సాంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.మండలంలోని ఏకైక నాట్య సంస్థలైన శ్రీ నటరాజన్ నాట్యాలయం ఆధ్వ ర్యంలో కారంగి సుధాకర్,శ్రీ శివజ్యోతి నాట్యమేళ కళా శాల ఆధ్వర్యంలో వెంకటేష్ (హైదరాబాద్) సోమ వారం ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. మహీర, అనిక, వర్ణిక విలాసిని, దిత్యారెడ్డి, శాన్వి,ఆద్యశ్రీ, యాశ్రీ,శ్రీవల్లి,సుమాలిక,జయంతిక,గోపిక,సాన్విక ప్రదర్శించిన భక్తి, సాంప్రదాయ నృత్యాలు సభికులను విశేషంగా అలరించాయి.నృత్య భంగిమలు,అభినయం, సమన్వయంతో చిన్నారులు తమ ప్రతిభను చాటగా,దేవ స్థానం అధికారులు, భక్తులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## అభినందనీయం



**ప్రజాపక్షం/నకిరేకల్ :**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభి నందనీయమని తాటికల్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రజ్ఞాపురం వెంకన్న అన్నారు. మంగళవారం తాటికల్ ఉన్నత పాఠశాలలో యాద శంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల 175 మంది విద్యార్థులకు సుమారు రూ.40 వేల విలువైన స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో యాద శంకర ఫౌండేషన్ ప్రతినిధులు మల్లగోని రామకృష్ణ, బొమ్మగాని దుర్గయ్య, బండ గొర్ల వీరస్వామి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు కానుగుల చంద్రకళ,ఉపాధ్యాయులు మార్త రాములు పాల్గొన్నారు.

## జలసిరి పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/డిండి;** తెలంగాణ జలసిరి జల సంచాయ్ జన్ భాగీదారీ పోస్టర్‌ను మంగళవారం ఎంపిడివో కార్యాలయం ఆవరణలో మండల ప్రత్యేకాధికారి శ్రీని వాస్, ఎంపిడివో వేజన, జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజన్, పంచాయతీ ఏఈ రాజు, ఏపివో శ్రీనివాస్, ఎస్టీవార్డెన్ లక్ష్మయ్య, ఏపిఎం విజయ్‌కుమార్, సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివో ఏలు, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

## పిఆర్‌సి ప్రకటించాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** 51 శాతం ఫిట్మెంట్‌తో పిఆ ర్‌సిని వెంటనే ప్రకటించాలని, పెండింగులో ఉన్న 6 డిఏ లను విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టి పియుఎస్) రాష్ట్ర ఆడిట్ కమిటీ కోకన్వీనర్ పెద్దిరెడ్డి శంకర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామ న్నపేట మండలంలోని సర్నేనిగూడెం, వెల్లంకి, సిరి పురం, రామన్నపేట, ఇంద్రపాలనగరం, భోగారం, లక్ష్మాపురం పాఠశాలలలో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు సప్పిడి సీనారెడ్డి, తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నవీన్, వనం అంజయ్య పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి :అదనపు ఎస్‌పి రమేష్




**ప్రజాపక్షం/ నల్లగొండ:** భారత ప్రభుత్వం,యువ జన వ్యవహారాలు , క్రీడల మంత్రిత్వ శాఖ,మై భారత్ నల్లగొండ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల,నల్లగొం డలో మంగళవారం నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.జిల్లా యువజన అధి కారి గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో కళాశాలలోని 4 ఎన్ ఎస్ఎస్ యూనిట్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చాయి.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు ఎస్‌పి శ్రీ రమేష్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని,క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు గోలి అమరేందర్ రెడ్డి,మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మారం వెంకటరమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫ సర్ కె.శ్రీనివాస్ రాజు తో పాటు అధ్యాపకులు పాల్గొ న్నారు.ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు పి.పుష్పలత,డాక్టర్ ఎ. వసంత చైతన్య,సుధ,ఆనంద్, వైస్ ప్రిన్సిపల్ కె.మంజుల, డాక్టర్ సాలయ్య,డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ అమరావతి, ప్రొఫ సర్ జ్యోత్స్న,సీనియర్ లైబ్రేరియన్ డాక్టర్ ఎస్. రాజా రామ్ పాల్గొన్నారు.

## డాగ్ స్క్వాడ్‌తో కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/నాంపల్లి:** జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరి ధిలో పోలీసులు డాగ్ స్క్వాడ్ సిబ్బంది తో కలిసి కిరాణా షాపులు,పాన్ షాపులు,ఇతర రద్దీ ప్రదేశా లలో గంజాయి,మాదకద్రవ్యాలు,గుట్కా,ఇతర అక్ర మాల నియంత్రణ లక్ష్యంగా ముమ్మర సోదాలు చేప ట్టారు.స్థానిక ఎస్ఐ లింగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈతనిఖీల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్ ను వినియోగించి తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కిరాణా దుకాణాల పేరుతో ఎవ రైనా నిషేధిత గుట్కాలు,గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.యువతను తప్పు దోవ పట్టించే అక్రమ వ్యాపారాలను ఏమాత్రం



సహించబోమని స్పష్టం చేశారు.అసాంఘిక కార్యక లాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.ఈకార్య క్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది,డాగ్ స్క్వాడ్ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఎంఇఒ మౌనికకు రేతు నేస్తం అవార్డు



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలో వ్యవ సాయ విస్తరణ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏఈఓ మౌనికకు రైతు నేస్తం అవార్డు లభించినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రావణకుమారి మగళ వారం తెలిపారు. రైతునేస్తం 100 వ ఎపిసోడ్ వేదు కలు మంగళవారం అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారని ఆమె అన్నారు.. రైతు నేస్తం 100 వ ఎపిసోడ్ కార్యక్ర మాన్ని చింతపల్లి మండల కేంద్రంలోని రైతు వేది కలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు వీక్షించారని ఆమె తెలిపారు.. ఈ కార్యక్రమానికి దేవరకొండ డివి జన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ లక్ష్మి హాజరు అయి విధిగా రైతు నేస్తం కార్యక్రమానికి హాజరు అవుతున్న డిండి మండలానికి చెందిన ఈశ్వ రయ్యకి అవార్డు వచ్చినందుకు ఆయనను ఏ డి ఏ సన్మానించి, మోమేంటోతో సత్కరించారు. ఈ కార్య క్రమంలో చింతపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రావణకుమారి, చింతపల్లి సర్పంచ్, పలువురు వ్యవ సాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ సేవా పథకం సర్టిఫికెట్

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** :స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేదరి శిబా చేతుల మీదుగా కళా శాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నడిం పల్లి వెంకటేశ్వర్లు జాతీయ సేవా పథకం సర్టిఫికెట్ అందుకు న్నారు.తన హయాంలో జాతీయ సేవా పథకం కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించినం దుకు గాను ఈ సర్టిఫికెట్‌ను ప్రిన్సిపల్ అందజే శారు.ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించ డంలో వెంకటేశ్వర్లు కీలక పాత్ర పోషించారని ప్రిన్సి పల్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు అరుణ,బేబి తదితరులు పాల్గొన్నారు.




## నేడు గురుపూర్ణిమ మహోత్సవం

**ప్రజాపక్షం/చింతపల్లి :** గురుపూర్ణిమ మహోత్స వాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో వెల సిన మరో శిరిడిసాయి సన్నిధిలో నేడు సాయినా ధునికి లక్ష బిల్వార్చన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల చేత సాయినాధునికి మధ్యాహ్నం సహస్ర కలశా లతో అభిషేకం నిర్వహించబడుతుందన్నారు. అదే విధంగా పంచామృత అభిషేకం, యాగశా లలో పూర్ణహుతి, బాబా సమాధి చెంది 108 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వామికి 108 రకాల నైవేద్యాలు సమర్పించడం జరుగు తుందని ఆలయ కమిటీ తెలిపింది. గురుపూర్ణిమ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం అల్పాహారాన్ని, మధ్యాహ్నం భోజనానికి ఏర్పాటు చేసినట్లు ధనుంజయ తెలిపారు. ఈ కార్యక్ర మంలో కొమిరి శెట్టి వెంకటయ్య, కుంభం పుల్లా రెడ్డి, ఊరే కృష్ణయ్య, తడకమళ్ళ శ్రీనివాస్ తదిత రులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికై తోడ్పాటునందించాలి

**మహిళ సమాఖ్య జిల్లా కమిటి ఎన్నిక**





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ కోరారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మహిళ సమాఖ్య జిల్లా నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా ఉప్పతల కోటమ్మ, ప్రధాన కార్యదర్శిగా దేవరం మల్లేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఐలాపురం లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం మహిళలపై జరిగే అఘాయి త్యాలను కట్టడి చేయాలన్నారు. స్త్రీలపై హింస, వివక్షత కొనసా గటం సమాజానికి చేటు అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సమాఖ్య నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధార్ పార్టీ రాబోయే ఎన్నికల్లో పోటీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాబోయే ఎన్నికలలో ఆదార్ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు ఈడ శేషగిరిరావు పేర్కొ న్నారు.మంగళవారం పట్టణంలోని గాంధీనగర్‌లో గల యాదవ్ భవన్‌లో జిల్లా ఆదార్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు.ఈసంద ర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ రాబోయే శాసనసభ, స్థానిక సంస్థలు,మున్సిపల్ ఎన్నికలలో ఆపార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. మాపార్టీ మహిళలకు 40 రిజర్వేషన్ కల్పించడంతోపాటు యువ తకు ప్రాధాన్యతను ఇచ్చి ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.రాష్ట్ర,దేశ భవిష్యత్తు దిశ నిర్దేశిత సూచించే ఆలోచన విధానం యువతకు ఉందని యువత ప్రతి విషయంలో ముందు ఉంటున్నారని తెలిపారు. ఈసమావేశంలో రాష్ట్ర ఉపాధ్య క్షులు అంబోజీ బుడ్డయ్య,ఎస్‌సి సెల్ చైర్మన్ అలెం వెంకటే శ్వర్లు,జిల్లా అధ్యక్షుడు పోట్టబత్తుల సైదులు,పార్లమెంటు నియోజ వర్గ అధ్యక్షులు సంకినాల హరినాథ్,సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎం ఎం గౌడ్,కంటి కేశవ,యుగంధర్ గౌడ్ ఉన్నారు.

## నకిరేకల్ మీదుగానే బుల్లెట్ ట్రైన్‌ను కొనసాగించాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను గతంలో ప్రతిపా దించిన విధంగా చిట్యాలనార్కట్‌పల్లినకిరేకల్ మీదుగా కొనసాగిం చాలని వివిధ రాజకీయ,ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్ మార్పుతో ఈ ప్రాంతానికి అన్యాయం జరు గుతుందని, నకిరేకల్‌ను బుల్లెట్ ట్రైన్ మార్గంలో కొనసాగించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు.ఈసమావేశంలో నాయకులు మాట్లా డుతూ జాతీయ రహదారి65పై ప్రాంతాలు వాణిజ్య,వ్యవసాయ, విద్యా,పారిశ్రామిక రంగాల్లో కీలకమైనవని పేర్కొన్నారు. డివిజన్ కార్యదర్శి అంబటి చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి కే. ధర్మార్జున్, న్యూడెమో క్రసీ రాష్ట్ర నాయకులు ఎం. డేవిడ్ కుమార్, సాగర్, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందాల పాపి రెడ్డి,సిపిఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జలసిరి విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/డిండి;** తెలంగాణ జలసిరిని విజయవంతం చేయా ల్సిన బాధ్యత ముఖ్యంగా మహిళా సంఘాలపై ఉన్నదని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరి షత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ జలసిరి మండల స్థాయి సమావేశానికి అధ్యక్షతన వహించి ప్రసంగించారు. సమావే శంలో ఎంపిడివో వేజన మాట్లాడుతూ ఎల్‌నినో సమస్యను ఎదుర్కొ వాలంటే తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని విజయవంతంగా చేసు కోవడం తప్పనిసరి అని అన్నారు. జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజన్, పంచాయతీ ఏఈ రాజు, ఏపివో శ్రీనివాస్, ఎస్టి వార్డెన్ లక్ష్మయ్య, ఏపిఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



## చేనేత సహకార సంఘాల బలోపేతానికి సహకారం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : చేనేత సహకార సంఘాల బలోపేతానికి తన వంతుగా పూర్తి సహకారం ఉంటుందని జిల్లా చేనేత జోలి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. పోచంపల్లి మున్సిపాలిటీలోని రేవనపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన సందర్భంలో కార్మికుల చేనేత కార్మికుల పరిశ్రమ అభివృద్ధికి కోసం పాలకవర్గాలు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రేవనపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు కొంగరి జంగయ్య, ఉపాధ్యక్షులు వనం వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకటేశం, కోశాధికారి గురుస్వామి, డైరెక్టర్ దుద్యాల జయమ్మ చేనేత కార్మికులు ఉన్నారు.

## నీటి నమూనా సేకరించిన పిసిపి అధికారులు



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం గ్రామ పరిధిలోని మోడంబావి కుంటలో కలుషిత నీటితో చేపలు చనిపోయాయి. మత్స్య కార్మిక సహకార సంఘం సభ్యులతోపాటు గ్రామ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలించారు. కుంటలోని నీటి నమూనాలను సేకరించారు. సేకరించిన నీటి నమూనాలను లాభకు పంపిస్తామని అధికారులు తెలిపారు. ఎస్ లింగోటం పరిధిలోని పరిశ్రమలు వెదజల్లిన వ్యర్థ రసాయన జలాలతో చేపలు మృత్యువాత పడ్డాయి. ఈ మేరకు కుంట్లగూడెం సర్పంచ్ అన్నాలు నరేష్, మత్స్య కార్మిక సంఘం సొసైటీ అధ్యక్షుడు కంచర్ల రాజు, పిసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. సేకరించిన నీటి నమూనాలను హైదరాబాదులోని ల్యాబ్‌కు పంపించి నివేదికను పై అధికారులకు అందజేస్తామని కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సైంటిస్ట్ పురుషోత్తం రెడ్డి తెలిపారు. నివేదిక ఆధారంగా కాలుష్య పరిశ్రమలపై, ఉన్నత అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

**ప్రజాపక్షం/మోటకొండూరు** : ఎల్ నినో ప్రభావం వల్ల సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు నష్టపోకుండా వరి పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలు గోధుమ, పెసర, కంది, మినుములు, వేరుశనగ లాంటి పప్పులు, నూనె గింజలకు సంబంధించిన పంటలను సాగుచేసుకుని అధిక దిగుబడులు సాధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా పంచాయతీ అధికారి కే శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిర, ఎంపిఓ చంద్రశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ యశోద, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# అడుగడుగునా బిసిలకు అన్యాయమే

**ప్రజాపక్షం/మోటకొండూర్** : బిసిలకు అడుగడుగునా అన్యాయమే జరుగుతుందని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలను నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షులు కల్లెం కృష్ణ అన్నారు. ఆయన మంగళవారం బీసీ హక్కుల సాధన సమితి మోటకొండూరు మండల 2వ మహాసభ మండల కేంద్రంలో బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షులు ఆలేటి బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో పాల్గొనిమాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం స్వాతంత్ర్యానంతరం అన్యా యానికి గురైంది బీసీలు మాత్రమే నని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ మహనీయుడు కృషి ఫలితంగా ఎస్సీ,ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం విద్యా ఉద్యోగ రంగాలలో మరియు రాజకీయ రంగాలలో రిజర్వేషన్ లభించాయని, ఆ తర్వాత కాలంలో ఉప ప్రణాళికలు రక్షణ చట్టాలు వచ్చాయని, దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు మాత్రం ఎలాంటి రాజకీయ రిజర్వేషన్లు లేవని కేవలం విద్యా ఉద్యోగ రంగాలలో మాత్రమే 27 శాతం రిజర్వేషన్లు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనా రాయణ, సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం,రైతు



సంఘం నాయకులు పెరబోయిన బంగారు యాదవ్,బీసీ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి పసుల నరసింహ, బొడిగ సుదర్శన్,జీవిలిక పెల్లి గణేష్, పాండు,మచ్చ పాండు, వస్పరి బీరయ్య,కొత్తపేట చంద్రయ్య,గిరబోయిన సుదర్శన్, రేగు యాదయ్య,పల్లె శ్రీను, సుదగాని వెంకన్న, కుమార స్వామి, శ్రీనివాసు పాల్గొన్నారు. **నూతన కమిటీ ఎన్నిక..** మోటకొండూరు మండలం బీసీ హక్కుల సాధన సమితి గౌరవా ధ్యక్షులుగా గాదగాని మాణిక్యం, అధ్యక్షులుగా ఆలేటి బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జంపాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కొత్తపేట చంద్రయ్య, గిరబోయిన సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా పసుల నరసింహ, సహాయ కార్యదర్శిగా పల్లె శ్రీనివాస్, సిద్దుల కుమారస్వామి, కోశాధికారిగా జివిలీకపల్లి గణేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# ఆరుతడి పంటలపై అవగహన పెంచాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోధూవలన మండలంలో రైతులకు ఆరుతడి పంటలపై, వర్షాభావా పరిస్థులపై అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో డిఆర్డీఓ టి నాగిరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, నీటి సరఫరా, విద్యుత్, ఉపాధిహామీ వీబీజీ రామ్ శాఖలపై సమీక్ష నిర్వహించడం, ఆయా శాఖల ద్వారా అమలు చేయబడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఎల్‌నినో సమస్య వలన రైతులు సగం వరి పంట ను, సగం ఆరుతడి పంటలను వేసుకోవాలని కోరారు. విద్యుత్ సమస్యలు, త్రాగునీరు, పండ్ల తోటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, మండల ప్రత్యేక అధికారి పి.జానయ్య, ఎంపీఓ వెంకటర్యుర్లు ఏఈ ఓఉమా, ఆయాగ్రామల సర్పంచ్‌లు, ఏపీఓ ఎర్ర నారాయణ, ఈసీ యశోద ఏ ఈ పీఆర్ చక్రధర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభతో విభిన్న ఆలోచనలే కెరీర్‌కు మలుపు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** :యువత ప్రతిభతో విభిన్న ఆలోచనలు చేసినప్పుడే కెరీర్ మలుపు తిరుగుతుందని బంగారు భవిష్యత్తు సొంతమవుతుందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య జన్మదిన, ఫౌండేషన్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని.. విద్యార్థులకు వక్తృత్వం, కవిత్వం, వ్యాసరచన, పెయింటింగ్, క్విజ్, మాక్ వెంసెంబ్లీతో పాటు టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్, టెన్నిస్ వంటి వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను నిర్వహించారు. అలాగే పుస్తకాల పంపిణీ, అన్నదాన కార్యక్రమం 'మెడికవర్' సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి పుట్టినరోజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ సీఈవో బోయపాటి శ్రవణ్, విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వైజర్, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపక సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/రామన్నపేట**: నకిరేకల్ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రామన్నపేట ముద్దుబిడ్డ యువ నాయకులు రామన్నపేట ఆశా కిరణం పల్లివాడ గ్రామ మాజీ సర్పంచ్ గంగుల వెంకటరాజిరెడ్డి జన్మదిన వేడుకలు రామన్నపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ సెంటర్ వద్ద పెద్దఎత్తున వివిధ



గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకుల సమక్షంలో కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరిగినది. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ నందు పండ్లను పంపిణీ చేశారు.



## రూ.1 లక్ష సాయం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** :మండలంలోని చెరువుగట్టు గ్రామంలో ఇటీవల జరిగిన భారీ అగ్నిప్రమాదంలో సుమారు 20 దుకాణాలు దగ్ధమై అనేక కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి.బాధిత కుటుంబాలను పరామర్శించిన గ్రామ మాజీ సర్పంచ్ మల్ల బాల కృష్ణ తక్షణ సహాయంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని కోరారు. ప్రభుత్వ సాయం అందే వరకు పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.గ్రామపంచాయతీ షాపుల షట్టర్ల లీజు కాలపరిమితిని మరో రెండు సంవత్సరాలు పొడిగించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ తీరుపై బీజేపీ లడాయి!



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదగిరిగుట్టలో భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దయ్యాల కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులకు రావలసిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని, తక్షణమే సమర్థుడైన మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు.మండలానికొక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పి, కనీసం జిల్లాకు ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు.విద్యార్థినులకు స్కూటీలు, డిగ్రీ, పీహెచ్డీ, వృత్తి విద్య అభ్యసించిన వారికి లక్షల్లో స్టైఫండ్ ఇస్తామన్న హామీలు ఉట్టి మాటలుగానే మిగిలిపోయాయని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, మండల మాజీ అధ్యక్షులు గుంటుపల్లి సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్లు మహేష్, ఆకుల చంద్రమౌళి పాల్గొన్నారు.

## ముందస్తు ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** :వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ సూచనలను అధికారులు ప్రజాప్రతినిధులు తప్పకుండా పాటించాలని మండల ప్రత్యేక అధికారి సురేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం భూదాన్ పోచంపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన,క్లస్టర్ ప్రత్యేకాధికారి డిప్యూటీ సీఈవో చిలుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి యం.విజయ, ఎమ్మార్వో పి.శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ సత్యనారాయణ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అపర్ణ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాసుల అంజయ్య గౌడ్, మండల స్థాయి అధికారులు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రామంలో వన మహోత్సవం

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని సర్పంచ్ గౌరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో మంగళవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం వారు ప్రతి ఇంటికి రెండు మొక్కల చొప్పున నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత సైతం తీసుకోవాలన్నారు. చెట్లను విరివిగా పెంచడం వల్ల వాతావరణ సమతుల్యానికి దోహదపడతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సుర్వంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ అమరావతి, పంచాయితీ కార్యదర్శి సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై దృష్టి

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** వాతావరణ ప్రభావం వల్ల ముందు జాగ్రత్తలుగా ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని డిఆర్డిఓ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యక్ష అధికారి బిక్ష పతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి డిఆర్డిఓ నాగిరెడ్డి పాల్గొని అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు సహకరించాలన్నారు. వర్షం భావం పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయడానికి అనుకూలమైన

## తిరుపతి వెంకన్న సమక్షంలో రాజిరెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/రామన్నపేట :** కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రధాన అనుచరుడు రామన్నపేట మండల ప్రజల ఆశాకిరణం నమ్ముకున్న కార్యకర్తలకు చేదోడు వాదోడుగా ఉండే నాయకుడు పల్లివాడ గ్రామ మాజీ సర్పంచ్ గంగుల వెంకట రాజిరెడ్డి జన్మదిన వేడుకలు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సమక్షంలో ఘనంగా జరిగినవి.తిరుమల తిరుపతి వెంకటేశ్వరుని ఆశీస్సులు రామన్నపేట మండల ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షులు పున్న జగన్మోహన్, మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శంబాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల సందర్శన



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ మంగళవారం సందర్శించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థినీలకు ఉన్న వసతులు, భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం వివరాలను ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో ఎదురవుతున్న ఇబ్బందులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గురుకుల పాఠశాల ఆవరణలో పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు, కో ఆప్షన్ సభ్యురాలు సందగళ్ళ విజయ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని రాజపేట తండా పరిధిలోని 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాల నుంచి రక్షించాలని కోరుతూ మండల బిసి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. యువజన అధ్యక్షుడు కొండల్ నేతృత్వంలో బీసీ సంఘ నాయకులు,గ్రామస్తులు తాసిల్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కొండల్ మాట్లాడుతూ రాజపేట తండా పరిధిలోని సర్వే నంబర్లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు ఆక్రమించి, అందులో అక్రమంగా రహదారిని వేసి ప్రైవేట్ వెంచర్లో కలిపేశారని ఆరోపించారు.ప్రభుత్వ ఆస్తిని కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని,దీనిపై ఎలాంటి హక్కులు లేకున్నా కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం కబ్జా చేస్తున్నారని తెలిపారు.భవిష్యత్తులో గ్రామ అవసరాలకు,ప్రజా ప్రయోజనాలకు ఈ భూమి ఉపయోగపడుతుందని అన్నారు.బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,కబ్జా చేసిన ప్రాంతాన్ని తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకుని పరిరక్షించాలని కోరారు.వినతిపత్రం స్వీకరించిన తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిర్యాదుపై విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో బిసి సంఘ నాయకులు,గ్రామ యువకులు పాల్గొన్నారు.

## వర్షపు నీరు భూగర్భ జలాల పెంపుపై అవగాహన



**ప్రజాపక్షం/చండూరుః** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం , తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొటునుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని చండూరు మండలంలో అన్ని గ్రామాలలో ప్రజా యుద్ధంలా చేపట్టి విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ నాగమల్లేశ్వ రావు, ఎంపిడిఓ బండారు యాదగిరి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన జలసిరి వాల్ పోస్టర్ సందర్భంగా విడుదల చేశారు. ఈ సమావేశంలో ఎంపిఓ ఏరుకొండ కోటయ్య , సర్పంచ్‌లు ముక్కాంల వెంకన్న యాదవ్ , బోయపల్లి సునీత , గాలెంక రాంబాబు, ముదిగొండ ఆంజనేయులు , బోయపల్లి రాజేష్ , రావుల రజిత , లేదన్న సత్యం , పంచాయితీ కార్యదర్శులు , ఉపాధి హామీ సిబ్బంది , మహిళా సమాఖ్య అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి జి. శ్రీధర్ సూచించారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెం రైతువేదికలో మంగళవారం విబి జిరామ్ జి, జలసిరి పనులు, ఎల్‌నినో ప్రభావంపై అవగాహన సదస్సులో మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, తహశీల్దార్, ఎంపిడిఓ, మండల వ్యవసాయ అధికారి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం VBGRAMG పథకం కింద ఊరికి ఒక ఊట కుంట, రైతుల భూముల వద్ద పంట కుంటలు, గ్రామంలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంత(Magic soak pit)ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పై విషయాన్ని పురస్కరించుకొని మన తాజ్ పూర్ గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా విచ్చేసిన ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో ఊట కుంట, పంట పొలాల వద్ద పంట కుంటలు (ఫారమ్ పండ్) గ్రామంలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గౌరవ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఇప్పటికే గ్రామ పంచాయతీ తరపున ఒక ఫారంపండ్ నిర్మించామని గ్రామంలో కూడా ఇంకుడు గుంతలు లేని వాళ్ళని గుర్తిస్తూ అందులో భాగంగా మంగళవారం 20 ఇంకుడు గుంతలకు ముగ్గుపోసి పనులు ప్రారంభించామని తెలిపారు. అదేవిధంగా గతంలో నిర్మించిన ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బాలస్వామి, సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నరసి నర్సింగ్ రావు, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహమ్మద్ గలీబి యాకుబ్, బొమ్మారపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజు, బీట్కూరి మహేష్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఆపొద్దు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను లేనిపోని కారణాలతో ఆపవద్దని సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కాసుల అంజయ్య గౌడ్ హౌసింగ్ బోర్డ్ భువనగిరి జిల్లా డి ఈ నీ కోరారు. పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సుదీర్ఘ అభివృద్ధి సమీక్ష, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్త సమావేశంలో పాల్గొన్న ఆయన శాఖల వారిగా నివేదికలు సమర్పిస్తున్న సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రాక లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల ముందు ఆయన ఏకరువు పెట్టారు. కడుపు ఎదురుగా ఉన్నవారే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఉన్నారని వారిని కొలతల పేరిట ఇంకా ఇతర కారణాలతో బిల్లులను ఆపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ జిల్లా డిప్యూటీ సీఈవో శ్రీనివాస్ మండల ప్రత్యేక అధికారి సురేష్ ల ముందు అధికారులను ప్రశ్నించారు. వెంటనే డిప్యూటీ సీఈవో స్పందిస్తూ ఒకసారి లబ్ధిదారులుగా ఎంపికైన తర్వాత ఇంటి నిర్మాణం మొదలుపెట్టాక ఎట్టి పరిస్థితుల్లో బిల్లులను ఆపవద్దని డిఈ, ఏఈలకు మౌఖికంగా ఆదేశిస్తూనే పేదల పేదలు ఆర్థికంగా నిలతుక్కునేందుకే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని పునరుద్ఘాటించారు. సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు లేవనెత్తిన ప్రశ్నలు లబ్ధిదారుల క్షేమం కోసం మాట్లాడిన మాటలతో సమావేశం లో పాల్గొన్నవారు హర్షం వ్యక్తం చేశారు.



## ఘనంగా సీత్లా పండుగ వేడుకలు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ప్రకృతిని పూజించే మహోన్నత గిరిజన వేడుక సీత్ల భవాని పండుగని, గిరిజనుల ఆధ్యాత్మిక విశ్వాసం, ప్రకృతి పట్ల గౌరవం పశుసంపద పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన పవిత్రమైన పండుగ అని గిరిజనులు తుర్కపల్లి మండలంలోని రాంపూర్ తండాలో సీత్లా భవాని పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామశాంతి, రైతులకు సస్యశ్యామలంపై,ప్రకృతి విపరీత్యాలపై సాంస్కృతి సంప్రదాయ ఆచార వ్యవహారాలను ప్రదర్శించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తారు. ప్రతీ ఏడాది గిరిజన ప్రజలఆనవాయితీగా, సాంప్రదాయ బద్ధంగా చిన్న పుష్యమి కార్తెలో ఏడు గ్రామదేవతలకు జొన్నలతో నైవేద్యం పెట్టి,ఆ తర్వాత ప్రతి ఇంటి నుండి బోనాల రూపంలో ఎత్తుకొని గ్రామం నుండి గ్రామ పొలిమేర వరకు చిన్న,పెద్ద అన్న బేధం లేకుండా ఊరేగింపుతో నృత్యాలతో నాట్యాలు చేస్తూ ర్యాలీగా వచ్చి దేవతలకు నైవేద్యం సమర్పించిన అనంతరం తమ తమ మొక్కులను చెల్లించుకుంటారు. గ్రామ పెద్దలు, రామావత్ హరి శంకర్,ధనవత్ మోత్యానాయక్, సర్పంచ్ గూగులోత్ బద్దు నాయక్,భానోత్ శత్రు నాయక్, బానోత్ ఈశ్వర్ లాల్, నాయక్,గూగులోత్ హాచ్చు నాయక్,ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధీరావత్ పట్టు నాయక్,లక్ష్మణ్,భానోత్ నరేందర్ బానోత్ చక్కు,మహిళలు పాల్గొన్నారు.

## జైపాల్ రెడ్డికి నివాళులు



**ప్రజాపక్షం/రామన్నపేట :** భారతదేశంలో అత్యున్నత స్థానంలో సేవలందించి ఉత్తమ పార్లమెంటేరియన్ గా గుర్తింపు పొంది,కేంద్రంలో మంత్రి పదవులకు వన్నె తెచ్చి,కోట్ల మంది హృదయాలలో నిలిచిన మహనీయుడు జైపాల్ రెడ్డిని భారతదేశ సమాజమంతా వారు చేసిన సేవను గుర్తుపెట్టుకున్నదని, అంగవైకల్యం శరీరానికే కానీ జ్ఞానానికి కాదని నిరూపించిన మహనీయుడు,నిస్వార్థతతో చరిత్రలో నిలిచిన మహనీయునిగా రాజకీయాల్లో గుర్తింపు తెచ్చారని డాక్టర్ ఎన్ అశోక్ గుర్తు చేశారు.ఆయన ఏడవ వర్ధంతి సందర్భంగా శృతివనం ఘాటులో రాష్ట్ర దివ్యాంగుల సంఘాలు నివాళులు అర్పించాయి. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్, మహిళ సాధికారిక రాష్ట్ర అధ్యక్షురాలు కోళ్ల రాజ్యలక్ష్మి, విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు ధోరపల్లి దానమ్మ, విశ్వవిద్యాలయాల ఫోరం సహాయ కార్యదర్శి మోదల సైదులు యాదవ్ పాల్గొన్నారు.

## 29న మిర్యాలగూడకు బిసి కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్ రాక



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర వెనుకబడిన తరగతుల (బీసీ) కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్ ఈ నెల 29న మిర్యాలగూడ పట్టణంలో పర్యటించనున్నారు. నల్లగొండ జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. హైదరాబాద్ నుండి కారులో ఉదయం 9 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12:30 గంటలకు మిర్యాలగూడ ఎన్ఎస్పి అతిథి గృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 1:30 గంటల వరకు మున్సిపల్ అధికారులతో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన వివిధ ప్రగతి పనులు, సంక్షేమ పథకాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తారు. సమీక్ష పూర్తి అయిన పిమ్మట మధ్యాహ్నం 2:30 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమవుతారు.